క్లుప్తంగా

పొదుపుతో ఆర్థిక భరోసా



కాటారం: పొదుపుతో ఆర్థిక భరోసా కలుగుతుందని తపాలశాఖ గంగారం బ్రాంచ్ పోస్టు మాస్టర్ కుడుదుల కిష్టయ్య అన్నారు. తపాల శాఖ ఆధ్వర్యంలో గంగారం పోస్టాఫీస్ పరిధిలోని గ్రామాల్లో మహిళ సమ్మాన్ సేవింగ్ పథకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బీపీఎం కిష్టయ్య మాట్లాడుతూ.. మహిళల ఆర్థికత పెంపొందించడం కోసం తపాల శాఖ ద్వారా చిన్న మొత్తాల పొదుపు ప్రవేశ పెట్టడం జరిగిందని ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతంలో మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలనే లక్ష్యంతో తపాలశాఖ ద్వారా పొదుపు పథకానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. ప్రతి మహిళ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బుర్రి శ్రీనివాస్, రాజుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని జమా మసీదులో పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ముస్లింలకు సర్పంచ్ వెన్నపురెడ్డి వసంతమోహన్‌రెడ్డిల ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. అనంతరం మతచపెద్దలను వారు సన్మానించారు. అమీన్, నిసార్, శఫీక్, జానీ, శకీల్, ఖాసీం పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ..



కాటారం: రంజాన్ పవిత్ర మాసాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని గారెపల్లి, అంకుషాపూర్, ఇబ్రహీంపల్లి మజీద్‌ల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ఇఫ్తార్ విందు కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ యూత్ నాయకుడు, శ్రీపాద ట్రస్టు చైర్మన్ దుద్దిళ్ల శ్రీనుబాబు ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రంజాన్ ఐక్యతకు నిదర్శనమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పంతకాని సమ్మయ్య, యూత్ అధ్యక్షుడు చీమల సందీప్, కోఆప్షన్ సభ్యుడు అజీజ్, కాంగ్రెస్ నాయకులు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

నర్సింగాపూర్‌లో..

మహాముత్తారం: రంజాన్ మాసాన్ని పూరస్కరించుకొని మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన మసీదులో ముస్లింలు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసుకున్నారు. ఈ ఇఫ్తార్ విందుకు బీఆర్ఎస్ నాయకులు జాటోత్ జేపాల్‌నాయక్, మండల ఉపాధ్యక్షుడు మిర్జాసాలార్‌బేగ్, మసీదు కమిటీ సభ్యులు జావిద్, ముస్లిం మతపెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి



పలిమెల: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ కురసం బుచ్చక్క అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బుచ్చక్క అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బుచ్చక్క మాట్లాడుతూ.. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. అనంతరం ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ హేమలత, ఎంపీటీసీ కల్యాణి, సర్పంచ్‌లు నాగయ్య, సత్యనారాయణ, ఎంపీడీఓ ప్రకాశ్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో టిప్పర్ దగ్ధం



కాళేశ్వరం: మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరం పరిధిలోని గ్రావిటీ కెనాల్ వద్ద షార్ట్ సర్క్యూట్‌తో శుక్రవారం రాత్రి టిప్పర్ దగ్ధమైంది. డ్రైవర్ రాజు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కాళేశ్వరం పరిధిలోని గ్రావిటీ కెనాల్ వద్ద 230 కేవీ విద్యుత్ టవర్ల వద్ద మట్టిని తరలిస్తున్న టిప్పర్ షార్ట్ సర్క్యూట్‌కు గురైనట్లు తెలిపారు. ఒక్కసారిగా ఇంజన్‌లో నుంచి మంటలు రావడంతో అప్రమత్తమై కిందకి దూకినట్లు తెలిపారు. టిప్పర్ విలువ సుమారు రూ.45లక్షలు ఉంటుందన్నారు.

మావోయిస్టులకు సహకరించొద్దు



మహాముత్తారం: గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై



పలిమెల: గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై అరుణ్

మహాముత్తారం: మావోయిస్టులకు ఎవరు సహకరించొద్దని ఎస్సై సుధాకర్ గ్రామస్తులకు సూచించారు. కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని కోనంపేటలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ప్రభుత్వం నుంచి వస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. మావోయిస్టులు చెప్పే మాటలు నమ్మి మోసపోవద్దని యువకులకు సూచించారు. అదే విధంగా అటవీ ప్రాంతంలోని వన్యప్రాణులను వేటాడవద్దని సూచించారు. అలాంటి వారిపై శాఖపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతందని హెచ్చరించారు. యువత గుడుంబా, గుట్కా, గంజాయిలాంటి దురలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. గ్రామంలో ఎవరైన అనుమానస్పదంగా కొత్త వ్యక్తులు తిరిగితే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఎస్సై వెంట సీఆర్పీఫ్, సివిల్‌పోలీసులు ఉన్నారు.

సీసీ కెమెరాలపై అవగాహన

మండలకేంద్రంలోని కోనంపేటలో సీసీకెమెరాల ఏర్పాటుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో సీసీ కెమరాల వాటి ఉపయోగాలు వాటివల్ల కలిగే లాభాల గురించి వివరించా రు. వీటి ఏర్పాటు కోసం గ్రామస్తులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, వ్యా పారస్తులు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పలిమెలలో..

పలిమెల: అనుమానితులకు ఆశ్రయం కల్పించినా, చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడిన చట్ట ప్రకారం చర్యలు తప్పవని ఎస్సై అరుణ్ అన్నారు. కమ్యూనిటీ కాంటాక్ట్‌లో భాగంగా శుక్రవారం మండలంలోని దమ్మూరులో పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం ఎస్సై అరుణ్ గ్రామస్తులతో మాట్లాడుతూ.. స్కూల్స్, కాలేజీలకు సెలవులు ఇవ్వడంతో పిల్లలు ఊర్లలోకి వస్తున్నారని, ఎండాకాలం నేపథ్యంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పనులకు వెళ్లే వారు వడదెబ్బ తగలకుండా తగిన నీరు తీసుకునేలా జాగ్రత్త పడాలన్నారు. పిల్లలను బాగా చదివించి వారికి మంచి భవిష్యత్‌ను అందించాలని తల్లిదండ్రులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

‘ఉపాధి’ని సద్వినియోగం చేసుకోవాలి



కూలీలతో మాట్లాడుతున్న మంజులాదేవి

టేకుమట్ల: ఉపాధిహామీని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ ఏపీడీ మంజులదేవి అన్నారు. శుక్రవారం మండలంలోని ఆశిరెడ్డిపల్లిలో కొనసాగుతున్న ఉపాధిహామీ పనులను ఆమె పరిశీలించి మాట్లాడారు. ఉపాధిహామీలో పని చేస్తున్న ప్రతీ కూలీకి ప్రభుత్వం రూ.272లను చెల్లిస్తుందన్నారు. ఉపాధిపనిలో ఫీల్డ్ అసిస్టెంట్లు ఇచ్చిన కొలతల ప్రకారం పని చేయాలని తెలిపారు. చెరువుల్లో తీసిన మట్టిఎరువుగా పంటలకు ఎంతో ఉపయోగపడుతుంది కావున రైతులు పొలాల్లో పోసుకుని నేలను సారవంతం చేసుకోవాలన్నారు. ఎండల తీవ్ర ఎక్కువగా ఉంది కావున తగు జాగ్రత్తలు తీసుకుని పనులు ముగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ అనిత, స్థానిక సర్పంచ్ వెలిశెట్టి స్వర్ణలతసురేష్, ఏపీఓ మాధవి, ఈసీ రాము, టీఏ మహేందర్, కుమార్, వినీల, పంచాయతీ కార్యదర్శి ప్రవీన్, ఉప సర్పంచ్ దూబల రాజయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ మహేందర్, తదితరులు ఉన్నారు.

రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలి



దీక్షలో పాల్గొన్న తీన్మార్ మల్లన్న టీం సభ్యులు

భూపాలపల్లి రూరల్: సెర్ప్‌లో భాగమైనా వీఓఏలను రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలని తీన్మార్ మల్లన్నటీం జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఐకేపీలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ.. వీఓఏలు జిల్లా కేంద్రంలో చేపట్టిన దీక్ష శుక్రవారం నాటికి నాల్గొవ రోజుకు చేరుకుంది. ఈ దీక్షలకు మల్లన్న టీం సభ్యులు సంఘీభావం తెలిపారు. దీక్షను ఉద్దేశించి మల్లన్న టీం జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ మాట్లాడుతూ.. నాలుగు రోజులుగా వీఓఏలు దీక్షలు చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని, రూ.10 లక్షల సాధారణ బీమా ఆరోగ్య బీమా కల్పించాలన్నారు. వీఓఏలకు న్యాయం జరిగే వరకూ మల్లన్న టీం తరఫున అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

సభను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న రవీందర్

భూపాలపల్లి రూరల్: దళిత్ శక్తి ప్రోగ్రాం(డీఎస్‌పీ) వ్యస్థాపకుడు విశారదన్ మహారాజ్ చేపట్టిన 10వేల కిలోమీటర్ల స్వరాజ్య పాదయాత్ర ముగింపు బహిరంగ సభ ఈ నెల 30న హైదరాబాద్ సరూర్ నగర్ స్టేడియంలో జరగనుందని ఈ సభకు జిల్లా నుంచి ప్రజలు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు కొత్తూరు రవీందర్ పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సభకు జిల్లా నుంచి డీఎస్‌పీ నాయకులు, కార్యకర్తలు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు విద్యావంతులు, ఉద్యోగస్తులు ప్రజాస్వామ్యవాదులు లక్షలాదిమంది తరలిరాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు రాజ్ కుమార్, ప్రధాన కార్యదర్శి రవీందర్, కోశాధికారి అశోక్ , జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

గ్రామ దేవతల వార్షికోత్సవం



హోమంలో పాల్గొన్న గ్రామస్తులు

చిట్యాల: మండలంలోని నైన్‌పాక గ్రామంలో భూలక్ష్మి మహాలక్ష్మి గ్రామ దేవతలను ప్రతిష్ఠించి పది సంవత్సరాలు పూర్తి చేసుకున్నందున దశమ వార్షికోత్సవాన్ని సర్పంచ్ తొట్లలక్ష్మి ఐలయ్య శ్రీ రామకష్ణ పరమహంస ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ప్రజలందరూ సుఖశాంతులతో, అష్ట ఐశ్వర్యాలతో, ఆయురారోగ్యాలతో, ఉండాలని పెండ్యాల ప్రభాకరచారి, మిన్నాపురం రమేష్‌చారి, వేద పండితులతో గణపతి పుణ్యవాచన హోమం కుంకుమ పూజ అంగరంగ వైభవంగా జరిపించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈహోమం పూజలో గ్రామంలోని 40 మంది జంటలు పూజలో పాల్గొని హోమం కాల్చారు. రఘుపతి రెడ్డి, నందికొండ రాఘవరెడ్డి, నందికొండ దేవేందర్ రెడ్డి, చిన్నల శ్రీనివాస్, కైరిక కిషన్ రావు, చిన్నల రమేష్, బావు గట్టయ్య, మారెళ్ల దేవేందర్ రెడ్డి, నూక వీరన్న, నూకరాజు పాల్గొన్నారు.

ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

కాటారం: గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశం కోసం రేపు(ఆదివారం) నిర్వహించనున్న ప్రవేశ పరీక్షకు కాటారం మండల కేంద్రంలోని గిరిజన గురుకుల సంక్షేమ బాలికల అప్‌గ్రేటేడ్ కళాశాల పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రిన్సిపాల్ లలితాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఓఎంఆర్ విధానంలో ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. పరీక్ష రాసే విద్యార్థులు ఉదయం 10 గంటల లోపు పరీక్షా కేంద్రానికి హాజరు కావాలని, పరీక్ష ప్రారంభించిన తర్వాత పరీక్షా హాల్‌లోకి అనుమతి లేదని తెలిపారు. విద్యార్థులు హాల్‌టికెట్‌ను ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకొని వెంట తీసుకొనిరావాలని సూచించారు.

ఆర్థికసాయం



నగదు, సరుకులు అందిస్తున్న ఎస్సై శ్రీకాత్‌రెడ్డి

టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలంలోని రామన్నగూడెంతండాకు చెందిన బాదావత్ చందు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబానికి రేగొండ ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి రూ.10వేల ఆర్థిక సాయంతో పాటు, నిత్యావసర సరుకులను అందించాడు. అంతేకాకుండా చందు కుటుంబానికి ఆసరాగా నిలిచేందుకు గ్రామంలో సోషల్ మీడియా గ్రూప్‌ను సైతం ఏర్పాటు చేసి ఆర్థిక సాయం అందించేలా యువతను ప్రోత్సహించారు. ప్రయాణాల్లో వాహనదారులు జాగ్రత్తగా ప్రయాణించాలన్నారు. రోడ్డు నియమాలు పాటిస్తూ వాహనాలను నడుపాలని చందు లేని లోటు ఎవరూ తీర్చలేనిదన్నారు. కావున ప్రతీ ఒక్కరు జాగ్రత్తగా ప్రయాణం చేయాలన్నారు.

కంటి పరీక్షలు చేయించుకోవాలి



కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

మొగుళ్లపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు శిబిరంలో ప్రతిఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని ఎంపీపీ యార సుజాత సంజీవరెడ్డి, జెడ్పీటీసీ జోరుక సదయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని బంగ్లాపల్లి, పాత ఇస్సిపేట గ్రామాల్లోని గ్రామ పంచాయతీ ఆవరణలో వైద్యాధికారిని నాగరాణి, నవిత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమానికి ఆయా గ్రామాల సర్పంచ్‌లు రజిత, సరళతో కలిసి వారు ప్రారంభించి మాట్లాడారు. 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్, అనూష వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే అధికారం



మాట్లాడుతున్న గండ్ర సత్యనారాయణరావు

మొగుళ్లపల్లి: రాబోయే ఎన్నికల్లో కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్‌దే అధికారమని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శుక్రవారం మండలంలోని పోతుగల్లు, ఇప్పలపల్లి, ఆకినపల్లి, పర్లపల్లి గ్రామాలల్లో గండ్ర సత్యనారాయణరావు హాథ్ సే హాథ్ జోడో యాత్ర కార్యక్రమాన్ని చేపట్టారు. యాత్రలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలతో కూడిన కరపత్రాన్ని ప్రజలకు అందజేశారు. అనంతరం పలు గ్రామాలలో ఏర్పాటు చేసిన రోడ్ షోలో ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లు గడుస్తున్నా, బడుగు, బలహీన వర్గాలకు సంక్షేమం అందరిని ద్రాక్షగానే మిగిలిపోయిందని ఎద్దేవా చేశారు. గ్రామాలల్లో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు వెలిశాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే బెల్ట్ షాపులను బంద్ చేస్తామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో ఇప్పటివరకు ఒక్క ఎకరానికి కూడా నీరు అందించని ఘనత బీఆర్ఎస్‌దేనని ఎద్దేవా చేశారు. ఇప్పుడు వ్యవసాయ భూములకు పారే నీరంత కూడా కాంగ్రెస్ హయాంలో కట్టిన ప్రాజెక్టుల ద్వారా వస్తున్నవే అని తెలిపారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో నిరుద్యోగుల, రైతుల ఆకలి చావులు, ఆత్మహత్యలు సామాన్య ప్రజల నెత్తిపై అప్పులు తప్ప ఎలాంటి ప్రయోజనాలు కలగలేదని అన్నారు. కేంద్రంలోని మోదీ అదానీ ఆర్థికంగా ఎదగడానికి మాత్రమే కృషి చేస్తున్నారని విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అవినీతి, అక్రమాలు, భూకబ్జాలు మితిమీరిపోతున్నాయని అన్నారు. ఈ యాత్రలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆకుతోట కుమారస్వామి, మండల మాజీ కో ఆపరేటివ్ చైర్మన్ పోలినేని లింగారావు, బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ బండి సుదర్శన్ గౌడ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ఓనపాకల ప్రసాద్, మండల ముఖ్య నాయకులు తక్కళ్లపల్లి రాజు, మండ రవి, మల్సాని రాజేశ్వర్ రావు, పడిదల ప్రకాష్ రావు, నడిగోటి రాము, ఓనపాకల లింగయ్య ఉన్నారు.

తహసీల్దార్‌ను కలిసిన శ్రీనివాసరావు



ప్రసాదం అందజేస్తున్న శ్రీనివాసరావు

మహదేవపూర్: మండల నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన మాధవిని టీఆర్ఎస్‌పార్టీ మండల అధ్యక్షుడు, కాళేశ్వరం దేవస్థనం చైర్మన్ లింగంపల్లి శ్రీనివాస్‌రావు మర్యాదపూర్వకంగా కలిశారు. మండల పరిస్థితులపై చర్చించి ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని కోరారు. ఈ సందర్భంగా కాళేశ్వరం దేవస్థాన ప్రసాదం అందించారు.

నిధుల విడుదల

మహాముత్తారం(మల్హర్): మల్హర్ మండలంలోని పెద్దతూండ్ల గ్రామంలోని తీగలవాగు నిర్మానంతో బాగంగా బొగ్గులవాగులో భూములు కోల్పోయిన రైతులకు పరిహారం చెల్లించడానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్లు భూపాలపల్లి ఆర్డీఓ శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. మొదటి విడతలో 40.37 ఎకరాలకు సంబంధిచిన భూములకు రూ.4కోట్ల51లక్ష73వేల450ని ప్రభుత్వం విడుదల చేసినట్లు తెలిపారు. రైతులకు సంబంధించిన బ్యాంక్‌పాస్‌బుక్‌తోపాటు ఆధార్‌కార్డు, ఒక ఫొటో పాటు సంబంధిత అధికారులకు అందజేయాలని సూచించారు.

గొర్రెల పంపిణీపై అవగాహన



మాట్లాడుతున్న ఎంపీపీ లావణ్య

భూపాలపల్లి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమం చేపట్టినందున ఈ సదవకాశాన్ని గొర్రెల కాపరులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ మండల లావణ్య సాగర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం భూపాలపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమంపై ఎంపీపీ అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వంహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రెండో విడత కార్యక్రమంలో ఎంపికైన లబ్ధిదారులు దరఖాస్తు ఫారంతో పాటు కులం సర్టిఫికెట్, బ్యాంకు పాస్‌బుక్, నామిని ఆధార్ జిరాక్స్ కాపీలను పంచాయతీ కార్యదర్శులకు అందజేయాలని సూచించారు. ఈ సమావేశంలో మండలస్పెషల్ ఆఫీసర్ డీపీఓ ఆశాలత, ఎంపీడీఓ అనిల్ కుమార్, మండల పశువైద్యాధికారి డాక్టర్ తిరుపతి, ఎంపీఓ నాగరాజు, ఎంపీటీసీలు, సర్పంచులు, యాదవ సంఘం గ్రామ కమిటీల సభ్యులు తదితరులు పాల్గొన్నారు

బాధిత కుటుంబాలకు పరామర్శ



రేగొండలో పరామర్శిస్తున్న గండ్ర జ్యోతి



చిట్యాల: పరామర్శిస్తున్న సత్యనారాయణరావు

టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలంలోని రంగయ్యపల్లి, రేపాక, నాగుర్లపల్లి, దమ్మన్నపేట, నారాయణపూర్ గ్రామాలకు చెందిన చిర వెంకటయ్య, పొరండ్ల చేరాలు, గంజి దనుంజయ్, బొచ్చు రాజుగౌడ్, దూరిశెట్టి రాజనర్సయ్య, గణపాక ఎల్లయ్య, మోటం సాయిలు ఇటీవల పలు కారణాలతో మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాలను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు. ఆమె వెంట ఎంపీపీ పున్నం లక్ష్మీరవి, జెడ్పీటీసీ సాయిని విజయముత్యం, మండల అధ్యక్షుడు అంకం రాజేందర్, నాయకులు మోడెం ఉమేష్‌గౌడ్, టౌన్ అధ్యక్షుడు కొలెపాక భిక్షపతి ఉన్నారు.

చిట్యాలలో..

చిట్యాల: మండల కేంద్రానికి చెందిన రవీందర్ అనారోగ్యంతో హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు శుక్రవారం ఆస్పత్రికి వెళ్లి రవీందర్‌ను పరామర్శించారు. వైద్యుల తో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. చింతకుంట రామయ్యపల్లి సర్పంచ్ మధు వంశీకృష్ణ ఉన్నారు.



నైన్‌పాకలో పరామర్శిస్తున్న నాయకులు

నైన్‌పాకలో..

ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పీఏ తునికుల ప్రవీణ్ కుమార్ తండ్రి శ్రీనివాస్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. మృతుడి స్వగ్రహం మండలంలోని నైన్‌పాక గ్రామం కాగా బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం పరామర్శించారు. మృతుడి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. జిల్లా నాయకులు క్యాతరాజు సాంబమూర్తి , రాజిరెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం నాయకులు, గౌడ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీపతి ప్రభాకర్ గౌడ్, పెరుమండ్ల తిరుపతి గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వాలి

భూపాలపల్లి రూరల్: తెలంగాణ యూనిటైడ్ క్రిష్టియన్స్ అండ్ పాస్టర్స్ అసోసియేషన్ (టీఎల్ ఐసీపీఏ) జనరల్ సెక్రెటరీ సాలమన్ రాజ్‌ను ఎమ్మెల్సీగా తెలంగాణ ప్రభుత్వం నామినేట్ చేయాలని జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ సంఘం నుంచి ముఖ్యమంత్రిని అభ్యర్థిస్తున్నామని ఫెలోషిప్ జిల్లా అధ్యక్షుడు రాజవీరు తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం అన్ని మతాలకు సముచిత స్థానం కల్పిస్తుందన్నారు. క్రైస్తవుల సమస్యల పరిష్కారానికి త్వరలో రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రిని కలుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఫెలోషిప్‌జిల్లా సంఘం నాయకులు రవీందర్, రమేష్, అబ్రహం పాల్గొన్నారు.

సెలవుల్లో పిల్లలపై అప్రమత్తత అవసరం

టేకుమట్ల/రేగొండ: వేసవి సెలవుల్లో పిల్లలపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని టేకుమట్ల, రేగొండ ఎస్సైలు చల్ల రాజు, ననిగంటి శ్రీకాంత్‌రెడ్డి శుక్రవారం వేర్వేరు ప్రకటనలలో పేర్కొన్నారు. వేసవి సెలవుల్లో పిల్లలు ఎండ తాపానికి, సరదాకి వ్యవసాయ బావుల్లో చెరువుల్లో ఈత కొట్టేందుకు వెళ్తారు కావున తల్లిదండ్రులు నిత్యం అప్రమత్తంగా ఉంటూ పర్యవేక్షించాలన్నారు. ఈత సరదా పిల్లల కుటుంబాల్లో విషాదాన్ని నింపక ముందే ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే ద్విచక్ర వాహనాలను పిల్లలకు ఇవ్వరాదని సూచించారు. తల్లిదండ్రుల పర్యవేక్షణలో పిల్లలు ద్విచక్ర వాహనాలను నడుపాలని సూచించారు. ప్రస్తుతం సైబర్ నేరాలు పెరిగిపోతున్న నేపథ్యంలో సోషల్ మీడియాలో గుర్తు తెలియని వ్యక్తులు లింకులను పంపిస్తూ సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని అన్నారు. కావున పిల్లలకు సెల్ ఫోన్‌లను అవసరం ఉన్నప్పుడు మాత్రమే ఇవ్వాలన్నారు. పాఠశాలలు పునఃప్రారంభం వరకు నిత్యం పిల్లలపై జాగ్రత్తగా ఉండాలన్నారు.